## వ్యవసాయానికి 24గంటల కరెంటు కావాలి..



కొత్తగూడ: గత పాలకుల హయాంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. రాత్రింబవళ్లు పొలాల వద్దనే కాపాలా కాయాల్సిన దుస్థితి వచ్చేది. రాత్రివేళల్లో పొలాలకు నీరు పారించేందుకు వెళ్లి ప్రమాదాలకు గురై రైతన్నలు మృతిచెందిన సంఘటనలు చాలానే ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంక సీఎం కేసీఆర్ 24గంటల కరెంట్‌తో ఆ కష్టాలు తీరినయి. ఉదయం వేళలోనే పొలాలకు నీరు పారించుకుంటూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతున్నాం. గిప్పుడు కాంగ్రెసోళ్లు వచ్చి మూడు గంటల కరెంట్ ఇస్తామంటే ఎందుకు ఊరుకుంటాం. మాకు 24 గంటల కరెంట్ కావాలి. 10 హెచ్‌పీ మాటర్లు మాకు అవసరం లేదు. ఇప్పుడున్న ప్రభుత్వమే మళ్లీ రావాలి. బీఆర్ఎస్ పార్టీకే మా మద్దతు. *–ఈసం నరేశ్, రైతు, తిమ్మాపురం, కొత్తగూడ*

## ధరణితో మస్తు సౌలతయింది



పెద్దవంగర: గతంలో భూముల వివరాలు సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. అవసరాల కోసం భూములు అమ్మాలన్నా.. కొనాలన్నా.. తహసీల్, రిజిస్ట్రేషన్ ఆఫీసుల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి ఉండేది. పైసలు ఇస్తేగాని పని కాని పరిస్థితి ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వం భూముల రికార్డులను సరిచేసి ధరణి పోర్టల్‌లో నమోదు చేసింది. ఇప్పుడు భూములు కొన్నా.. అమ్మినా.. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న తర్వాతే 20నిమిషాల్లో తహసీల్దార్ ఆఫీస్‌లో వేలిముద్ర వేస్తే వెంటనే మారుతున్నది. కాంగ్రెస్ నాయకులు ధరణి తీసేస్తే మళ్లీ రైతులకు కష్టాలు తప్పవు. పాత పద్ధతులతో అన్ని సమస్యలే.. పదేళ్లుగా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉన్నాం. ఇగ కాంగ్రెస్ వస్తే అరిగోస తప్పదు. *–మట్టిపెల్లి చిన్నవెంకన్న, కొరిపెల్లి గ్రామం, పెద్దవంగర మండలం*



## ప్రజా సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం

కేసముద్రం, నవంబర్ 23: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన అందించారని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుంజపాడుగు కొమ్మన్న అన్నారు. సీఎం కేసీఆర్ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌ను మరోసారి గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కువ శాతం వ్యవసాయం, వ్యవసాయ కూలీ రంగంపై ఆధారపడి జీవస్తుంటారని, పంటల పెట్టుబడికి ఆర్థిక సాయం అందించాలనే ఆలోచన ఏ ముఖ్యమంత్రికి రాలేదన్నారు. గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి నీటిని విడుదల చేయడంతో గ్రామాల్లో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఆడబిడ్డల వివాహానికి కల్యాణలక్ష్మి ద్వారా రూ.100116 అందించి, వారి కుటుంబాలకు కొండంత అండగా నిలిచారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మరో సారి అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్, ప్రతి కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా, ప్రతి మహిళకు నెలకు రూ.3వేలు అందిస్తారని తెలిపారు. పంటల పెట్టుబడికి ఎకరానికి రూ.16వేలు, ఆసరా పింఛన్లు రూ.5 వేలు అందిస్తారని వివరించారు. రాష్ట్ర అభివృద్ధికి, పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న కేసీఆర్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బిర్రు వెంకన్న, ధరావత్ భీమా, రఫీ, దేవేందర్, బాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న బీఆర్ఎస్ నాయకులు

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 23: ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఓటు వినియోగం పైన తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఎంతో విలువైన ఆయుధం వంటిదని గుర్తించి తెలుకోవాలన్నారు. అందరూ భాగస్వాములై అత్యధిక ఓటు శాతం నమోదు చేయాలన్నారు. డాక్టర్ పరికిపండ్ల అశోక్, యుగేంధర్, సత్యనారాయణ, శ్రీవాణి, విజయకుమారి పాల్గొన్నారు.



కరపత్రాలతో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యమిత్ర సభ్యులు

# కేసీఆర్‌తోనే సబ్బండ వర్గాల అభివృద్ధి

- మానుకోట రూపురేఖలు మార్చిన శంకర్‌నాయక్‌ను గెలిపించాలి
- ఎన్నారై తన్నీరు మహేశ్



కారు గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎన్నారై సభ్యులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నారై ప్రతినిధుల బృందం

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 23: సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని ఎన్నారై ప్రతినిధులు తన్నీరు మహేశ్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మానుకోట ఎట్లా ఉండె.. ప్రస్తుతం ఎట్లా ఉందో.. కండ్లకు కట్టినట్లు కనబడుతున్నదన్నారు. సీఎం కేసీఆర్ నిధులను మంజూరు చేయడంతో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ద్వారానే పేదలకు న్యాయం జరుగుతుందని, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అభివృద్ధితో పాటు మెడికల్, ఇంజినీరింగ్ కళాశాల తెచ్చి పేద విద్యార్థులకు ఎంతో లబ్ధి చేకూర్చుతున్నారని వివరించారు. 5 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచన చేయాలని, అభివృద్ధి చేసిన శంకర్‌నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రలో ప్రతి ఇంటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎన్నారైలు బుచ్చిబాబు, భాస్కర్, శ్రీనివాసరెడ్డి, బిందులత, రమేశ్, కిశోర్, అభిషేక్, వినోద్, మందుల రఘు, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# వందశాతం హోమ్ ఓటింగ్

## ఏర్పాట్లు చేసిన ఎన్నికల అధికారులు

నర్సింహులపేట, నవంబర్ 23: మండలంలోని వివిధ గ్రామాల్లో 80 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించడంతో గురువారం మండలంలో ఎన్నికల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటు వేయించారు. మండల వ్యాప్తంగా 16 మంది దివ్యాంగులు, 21 మంది వృద్ధులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారు 100శాతం ఓటు హక్కు వినియోగించినట్లు ఎన్నికల అధికారి వివేక్ తెలిపారు. కొమ్ములవంచ గ్రామానికి చెదిన 102 ఏళ్ల గోపారపు విజయలక్ష్మి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

***గ్రామాల్లో బ్యాలెట్ ఓటింగ్***

చిన్నగూడూరు: మండల కేంద్రంతో పాటు ఉగ్గంపల్లి, విస్సంపల్లి, జయ్యారం, గుడుంరాజుపల్లి గ్రామాల్లో వృద్ధులు, వికలాంగులకు బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్యాంసుందర్ మాట్లాడారు. పోలింగ్ కేంద్రానికి రాలేని వారికోసం ఆయా గ్రామాల్లో బ్యాలెట్ ఓటింగ్‌ను అధికారులు నిర్వహించారన్నారు. మండల వ్యాప్తంగా 48 మంది ఓటర్లు ఉండగా, 44మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. ఓటు జన్మహక్కు అని ఓటు వేయాలని ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

దంతాలపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో 80 ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులను గుర్తించిన ఎన్నికల అధికారులు గురువారం వారి ఇంటికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకునేలా సౌకర్యాలు కల్పించారు. నాలుగు రూట్లుగా వెళ్లిన అధికారులు వారితో ఓటు వేయించారు.



నర్సింహులపేటలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న దివ్యాంగురాలు



ఇనుగుర్తి: ఓటు వేస్తున్న వృద్ధురాలు

ఇనుగుర్తి: మండలంలో హోమ్ ఓటింగ్ వందశాతం నమోదైనట్లు తహసీల్దార్ తోట సూర్యనారాయణ తెలిపారు. మొతం 67మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేయగా అందరు ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. వీరిలో వృద్ధులు 44 మంది, దివ్యాంగులు 23 మంది ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, గ్రామాల కార్యదర్శులు, బీఎల్‌వోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లికుదురు: మండలంలోని తహసీల్దార్ చాంబర్‌లో గురువారం తహసీల్దార్ రాజు విలేకరులతో మాట్లాడారు. నడవలేని స్థితిలో ఉన్నవారు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ హోం ఓటింగ్‌ను అమలు చేస్తున్నదని తెలిపారు. మహబూబాబాద్ నియోజక వర్గంలో మొత్తం 471 మంది హోం ఓటింగ్ వినియోగించుకోవడానికి అర్హులుగా ఉన్నారని, మొత్తం 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారన్నారు. నెల్లికుదురు మండలంలోని గ్రామాల్లో 80 ఏళ్ల పైబడిని వారు 95 మంది, దివ్యాంగులు 34 మంది ఉన్నారని తెలిపారు. మండలంలో 2 ప్రత్యేక బృందాలతో గురువారం, శుక్రవారం హోం ఓటింగ్ జరుగుతుందన్నారు. గురువారం మేచరాజుపల్లి, ఎర్రబెల్లిగూడెం, సొల్లతండాల్లో హోం ఓటింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.



దంతాలపల్లి: రేపోణిలో ఓటు వేస్తున్న వృద్ధురాలు

## పాఠశాలకు బీరువా బహూకరణ

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 23: మండల పరిధిలోని జమాండ్లపల్లి ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ంగా విధులు నిర్వహిస్తున్న గుగులోత్ కిషన్‌నాయక్ తన కూతురు అర్చన జ్ఞాపకార్థం రూ.10 వేల విలువైన బీరువాను గురువారం పాఠశాలకు అందజేశారు. పాఠశాలలో పిల్లల విద్యపై, పాఠశాల అభివృద్ధికి తన కృషి చేస్తానన్నారు. గ్రామంలో దాతలు ముందుకు వచ్చి పాఠశాల బలోపేతం కోసం తమ వంతు సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం రోజారాణి, మహేశ్, ప్రభావతి, సరిత పాల్గొన్నారు



పాఠశాలకు బీరువా అందిస్తున్న కిషన్ నాయక్, పాల్గొన్న టీచర్లు